

96
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** నాట్యం నేర్చుకోవాలన్న ఆసక్తితో కంకుభట్టు గురుకులం దగ్గరికి వస్తున్న యువతి.. మువ్వ. ఆమెను కలిసిన జాయపుడు.. తాను అనుమకొండ నుంచి వచ్చిన నాట్యాచార్యుడిననీ, నాట్యం నేర్పిస్తాననీ చెప్పాడు. కంకుభట్టు గురుకులంలోని వాళ్లకంటే గొప్ప నాట్యకారిణిగా తీర్చిదిద్దుతానని చెప్పి, శిక్షణ కూడా మొదలుపెట్టేశాడు. అలా మాసంరోజులు గడిచాయి. ఓ రోజు ఊహించని సంఘటన జరిగింది. శిక్షణ ఇవ్వడానికి జాయపుడు రేవు దగ్గరికి రాగా.. అక్కడ మువ్వ లేదు. అప్పుడే తాటిపొదల చాటునుంచి ముందుకు వచ్చాడు ఆమె భర్త కపిలేశ. వెనకే మరికొందరు కూడా కపిలేశ పక్కకొచ్చారు.

బలప్రదర్శన కాబోలు.. మౌనం గొప్ప బలం కూడా.

జాయపుడు ముఖాన కించిత్ భయం తెచ్చి పెట్టుకున్నాడు.

''నిన్ను సూసుకుని నాపెళ్లాం నాపక్కలోకి రాడం లేదు. నిన్ను పాతేస్తే అది దారికొస్తది! దానికి సెప్పు. లేపోతే నిన్ను..'' అంటూ క్రోధంతో పిడికిళ్లు బిగించి.. గుంజకు కట్టిన దేవుడి విగ్రహాన్ని ఒక్కదెబ్బ వేశాడు. విగ్రహం విరిగి ముక్కచెక్కలవ్వగా.. ఆ గుంజ కదిలి నిల బడింది.

అతని మిత్రులంతా వికటాట్టహాసం చేశారు. అర్థమయ్యేలా చెప్పినట్లు సంతోషిస్తూ వెళ్లిపోయింది కపిలేశ బృందం. కారణం.. జాయపుడు ఇప్పుడు శరీరమంతా భయంతో వణికించాడు!

* * *

ఈరోజు ఉదయం నుంచి వాతావరణం వినూత్నంగా హడావుడిగా ఉంది. బాగా దట్టంగా పట్టిన నల్లని మబ్బులు ఆకాశంలో ఉరుకులు పరుగులు పెడుతుంటే.. ఉరుములు, మెరుపులు నిరంతరం శబ్దాలు చేస్తుంటే.. ప్రకృతి పిచ్చెక్కినట్లు ఊగిపోతున్నది.

చిన్నచినుకులు మనిషిని తడుపుతుంటే.. పెద్ద చినుకులు మీదికొచ్చి చెళ్లున కొడుతున్నాయి. చలిగాలి నృత్తమాడుతూ కృష్ణానదిని, తూర్పు సముద్రాన్నే కాదు.. దారులపై పోతున్న మనుషుల నెత్తిమీది బుట్టలను, గడ్డి మోపులను సైతం పడవేస్తున్నది. ఎడ్లబళ్లను, గుర్రాలను కూడా కదలనివ్వక చుట్టేసి ఊపివేస్తున్నది. మేకలు, కోళ్లు, కుక్కల అరుపులు పెరిగాయి.

సముద్రతీరపు వాతావరణం తెలియని జాయపుడు.. ఆ బీభత్స వాతావరణంలోనే రోజూ వచ్చే సమయానికే నంగెగడ్డరేవుకు చేరాడు. రేవంతా అల్లకల్లోలంగా ఉంది. రేవు ప్రయాణికులు కళ్లపై చేయిపెట్టి ఆకాశం వంక చూస్తూ.. 'పడవ ఎక్కాలా.. వద్దా!?' అన్న సందిగ్ధంలో ఆందోళనగా చర్చించుకుంటున్నారు. ముందే తెలిసినట్లు